## గడ్డెన్నవాగు రైతాంగానికి ఊరట



జీవో కాపీని చూపిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసా, ఆగస్టు 25 : గడ్డెన్నవాగు ప్రాజెక్టు రైతాంగానికి ఊరట లభించిందని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. గడ్డెన్నవాగు ప్రాజెక్టు కెపాసిటీ 358.7 మీటర్లు కాగా ప్రాజెక్టులో 357.5 మీటర్ల నీటి నిల్వ ఉంటేనే 2017 జీవో ప్రకారం సాగు నీరు విడుదలకు ఆస్కారం ఉండేది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సాగునీటి శాఖ మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకవెళ్లడంతో ప్రభుత్వం 355.9 మీటర్ల వరకు నీరు ఉన్నప్పటికీ సాగునీరు వాడుకోవచ్చని జీవో విడుదల చేసింది. దీంతో 0.6 టీఎంసీల నీరు అదనంగా వాడుకోవడం వల్ల 6 వేల ఎకరాలకు సాగునీరు అందడంతో మొత్తం 14 వేల ఎకరాలకు పూర్తి స్థాయిలో ప్రయోజనం చేకూరుతుందన్నారు. అంతేగాకుండా ఈ జీవో విడుదల వల్ల ప్రాజెక్టు ఎగువ భాగంలో లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా కుభీర్ మండల రైతులకు సాగు నీరు అందుతుందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో తానూర్ మండల శాఖ అధ్యక్షుడు చిన్నారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోపాల్ సర్డా, కౌన్సిలర్ కపిల్, నాయకులు కృష్ణ పాల్గొన్నారు.

## తండ్రి మృతిని తట్టుకోలేక..

- తనువు చాలించిన కుమారుడు



జహూర్ అలీఖాన్ (ఫైల్)



అబీద్ అలీఖాన్(ఫైల్)

నిర్మల్ చైన్‌గేట్, ఆగస్టు 25 : తండ్రి మృతిని తట్టుకోలేక కుమారుడు తనువు చాలించిన ఘటన నిర్మల్ పట్టణంలో చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ పట్టణంలోని ఆస్రా కాలనీకి చెందిన విశ్రాంత వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగి జహూర్ అలీఖాన్(74) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఇంటివద్దే మృతి చెందాడు. తండ్రి మృతి చెందిన విషయాన్ని ఆయన కుమారుడు అబీద్ అలీఖాన్(50) బంధువులకు సమాచారం తెలుపుతుండగానే ఒక్కసారి కుప్పకూలిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలిస్తుండగా గుండెపోటుతో మృతి చెందినట్లు స్థానికులు పేర్కొన్నారు. అబీద్ అలీఖాన్ ఓ టింబర్ డిపో నడుపుతున్నాడు. ఒకే రోజు తండ్రీకొడుకులు ఇద్దరు మృతి చెందడంతో వారి కుటుంబంలో విషాదం నెలకున్నది. ఒకే రోజు తండ్రీకుమారులు మృతి చెందడంతో నిర్మల్‌లో విషాదచాయలు అలుముకున్నాయి.





బ్యాంకు వద్ద రుణమాఫీ గురించి తెలుసుకునేందుకు గుమిగూడిన రైతులు





# ఆంక్షల తిరకాసు

### బజార్‌హత్నూర్‌లో 800 మందిలో 250 మందికే మాఫీ

- ఆధార్, పాస్‌బుక్, కుటుంబం అంతా ఒకే రేషన్‌కార్డులో ఉండడం
- 'నమస్తే తెలంగాణ' ఫీల్డ్ విజిట్‌లో ఆశ్చర్యగొలిపే విషయాలు

బజార్‌హత్నూర్, ఆగస్టు 25 : ఆదిలాబాద్ జిల్లాలోని బజార్‌హత్నూర్ గ్రామంలో 800 మందికి పైగా రైతులు క్రాప్ లోన్ తీసుకున్నారు. ఇందులో కేవలం 250 మందికి మాత్రమే రుణాలు మాఫీ అయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీ కేవలం కాగితాలకే పరిమితమైనట్లు రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రుణమాఫీ విషయమై.. నమస్తే బృందం బజార్‌హత్నూర్‌ను విజిట్ చేసింది. ఇందులో ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందే కానీ.. అమలు చేయడంతో విఫలమైందని ఆరోపించారు. ఓట్లు దండుకున్న తర్వాత మాట మారుస్తున్నదని ఆవేదన చెందారు. ఇప్పటికైనా ఆంక్షలు లేని రుణమాఫీని వెంటనే అమలు చేయాలని, లేదంటే రానున్న రోజుల్లో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని రైతులు హెచ్చరిస్తున్నారు.

#### క్లారిటి లేక తిప్పలు

రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన నిబంధనలు రైతులకు శాపంగా మారాయి. మాఫీపై క్లారిటి లేకపోవడంతో రైతన్నలు బ్యాంకు, వ్యవసాయశాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఆధార్‌లో పేరు, బ్యాంకు ఖాతాలోని పేరు, రూ.2 లక్షలకు పైగా రుణం తీసుకున్నా, కుటుంబంలో నలుగురికి ఒకే రేషన్ కార్డులో ఉండడం వల్ల మాఫీ కాలేదని అధికారులు పేర్కొంటున్నారు. షరతులతో కూడిన మాఫీ చేయడంపై రైతులు కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు.



రుణమాఫీ కాకపోవడంతో అధికారులను అడిగేందుకు రైతువేదికల్లో కూర్చున్న రైతులు

#### రేవంత్‌రెడ్డి తప్పు చేస్తుండు..



నాకు ఊహ తెలిసిన నుంచి నేను కాంగ్రెస్ వాదినే. ఇప్పుడు నా వయస్సు 61 ఏండ్లు. నా ఓటు ఇప్పటికీ కాంగ్రెస్‌కే కానీ రుణమాఫీ విషయంలో మాత్రం నా కడుపు మండిపోతుంది. రాజశేఖర్‌రెడ్డి హయాంలో రుణమాఫీ చేసినప్పుడు గిన్ని గొల్లాలు లేవు. ఇప్పుడు ఒకటుంటే ఒకటి లేదని రైతులను తిప్పలు పెడుతున్నారు. నేను ఎవరికి భయపడెటోన్ని కాదు. నా పేరు మీద తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ.2.25 లక్షలు, నా కుమారుడి పేరు మీద సొసైటీ బ్యాంకులో రూ.52 వేల అప్పు ఉంది. అయితే రూ.2లక్షలకు పైన ఉండడంతో పైడబ్బులు కడితేనే రుణమాఫీ అవుతదట. ఇగ వాళ్లేందయ్యా ఇచ్చేది తోకమట్ట.

- బొమ్మెడి సంటెన్న, రైతు, బజార్‌హత్నూర్

#### పైన రూ.215లు ఉన్నందుకే మాఫీ కాలేదు..



నాకు తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ.2 లక్షల రుణం ఉంది. అయితే ఈ జూలై మాసంలో నేను రూ.11 వేలతో నా లోన్‌ను రెన్యూవల్ చేసుకున్నా. అయితే ఇప్పుడు నా రుణం మొత్తం రూ.2,00,215 ఉంది. కేవలం రూ.215లు అధికంగా ఉండడంతోనే నా పేరు లిస్ట్‌లో రాలేదు. నేను యేటా బ్యాంకుకు వెళ్లి లోన్ రెన్యూవల్ చేసుకుంటా. రూ.2 లక్షల రుణమాఫీ కాలేక పోవడంతో బాధగా ఉంది. ఇలాంటి షరతులతో కూడిన ప్రభుత్వాన్ని నేను ఎప్పుడు చూడలేదు. సీఎం రేవంత్‌రెడ్డికి రైతుల ఉసురు తప్పకుండా తగులుతుంది.

- భగత వినోద్, రైతు, బజార్‌హత్నూర్

#### ఇంట్లో ఒక్కరికి మాఫైనా బాగుండు..



బజార్‌హత్నూర్ తెలంగాణ గ్రామీణ బ్యాంకులో నాకు, నా భార్య పేరిట రూ.2.45 లక్షల రుణం తీసుకున్నాం. మూడో విడుతలో రూ.2 లక్షలు మాఫీ అవుతాయని వ్యవసాయశాఖ అధికారులు చెప్తే నిజమేనని నమ్మి నిమ్మలంగా ఉన్నం. వచ్చిన లిస్టుల్లో మా పేర్లు లేవు. మేం రెగ్యులర్‌గా బ్యాంకుల రెన్యూవల్ చేస్తాం. అయినా మాఫీ కాలేదు. ఈ తిరకాసేందో ఎవరూ చెప్తలేరు. రేషన్‌కార్డుతోనైనా కుటుంబానికి రూ.2లక్షలు మాఫీ చేసినా బాగుండు. సగం మంది రైతులు రుణ మాఫీ కాకుండా మిగిలి ఉంద్రు. రూ.2లక్షలకు పైన రుణం ఉంటే మిగతాది మేం కట్టుకుంటం. అక్కడి వరకన్న మాఫీ చేయాలి కదా. ఎన్నికలప్పుడు నేను రాగానే రూ.2లక్షలు మాఫీ చేస్తానని రేవంత్‌రెడ్డి అన్నడు. ఇచ్చిన మాట ప్రకారం మాఫీ చేయాలే.

- ఇర్ల భోజన్న, రైతు, బజార్‌హత్నూర్

#### రూ.60 వేలు.. లిస్టులో పేరు రాలే..



సర్కారు ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తానంటే సంబరపడ్డా. నాకు జామిడి శివారులో ఎకరం 10 గుంటల భూమి ఉంది. నేను రూ.60 వేలు బాకీ తీసుకున్న. లిస్టుల పేరు రాలే. మా ఊళ్లో కొందరి పేర్లు వచ్చాయి. అందరికీ రుణమాఫీ చేస్తే మంచి గుంటది. ఇప్పుడేమో రుణమాఫీ కోసం చేను పనులు విడిచిపెట్టి, తిరగలేక పరేషాన్ అవుతుంది. మా ఇంట్లో ఒక్కరికి కూడా రుణమాఫీ ఎందుకు కాలేదో అర్థం అయితలేదు.

- ఆడెపు అమృత్, రైతు, జామిడి

#### రేషన్ కార్డు ఉన్నా రుణమాఫీ కాలే..



నాకు రేషన్ కార్డు ఉన్న రుణమాఫీ కాలే. నేను సొసైటీలో రూ.1.20 లక్షల రుణం తీసుకున్నా. ఇక రెండో లిస్టులో పేరు వస్తుందని ఆశగా జూసిన. రాకపోయేసరికి మూడో లిస్టులో వస్తుందని చెప్పింద్రు. ఇప్పుడు మూడో లిస్టు అయిపోంది. మరి నా బాకీ మాఫీ అయితదో కాదో తెలుస్తలేదు. తెలిసిన సార్లను అడిగుతే అయితదని అంటుంద్రు. మరి నాలుగో లిస్టులో నా పేరు వస్తుందో లేదో బాకీ మాఫీ అవుతదో కాదో ఏం తెలుస్తలేదు.

- నిమ్మల రఘు, రైతు, జామిడి



రుణమాఫీ కాలేదని ఆవేదన చెందుతున్న జామిడి రైతులు

### 80 శాతం రైతులకు
# మొండిచేయి

**ఆందోళన చెందుతున్న రైతులు**

- ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేయాల్సిందే..
- జామిడి సొసైటీలో దుస్థితి

తాంసి, ఆగస్టు 25 : రుణమాఫీ కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జామిడి పీఏసీఎస్‌లో 134 మంది రైతులు రుణం తీసుకుంటే.. ఇందులో 20 శాతం అనగా 27 మందికి మాత్రమే రుణం మాఫీ అయింది. మిగిలిన 107 మంది రైతులకు మూడో విడుతలో మాఫీ చేయక కాంగ్రెస్ ప్రభుత్వం మొండిచేయి చూపించింది. ఆదివారం 'నమస్తే తెలంగాణ' జామిడి గ్రామంలో ఫీల్డ్ విజిట్ చేయగా రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీ లోగా రుణమాఫీ చేస్తానని చెప్పి రైతులను నిండా మోసం చేసిందని వారు వాపోయారు. మూడో లిస్టు ముగిసిన పీఏసీఎస్ జామిడి సొసైటీలో 80 శాతం మంది రైతులకు రుణమాఫీ రాలేదని వెంటనే మాఫీ చేయాలని, లేదంటే ఊరుకునేది లేదని రైతులు హెచ్చరిస్తున్నారు.

#### మాఫీ ఎప్పుడు అవుతుందో ఏమో..



ప్రభుత్వ నిబంధన ప్రకారం రుణమాఫీకి అర్హుడిని. నాకు రెండెకరాల 20 గుంటల భూమి ఉంది. రూ.లక్ష బాకీ తీసుకుని వ్యవసాయం జేస్తున్నా. ఇప్పటి దాకా రూపాయి కూడా మాఫీ కాలేదు. సన్నకారు రైతులకే రుణమాఫీ చేయని ప్రభుత్వం అందరికీ మాఫీ చేస్తుందని చెబుతుంది. మూడు విడుతల్లో ఏ జాబితాలో నా పేరు లేదు. మరి ఎప్పుడు మాఫీ అవుతుందో ఏమో. మా ఊరిలో నాలాంటి ఎందరో పేద రైతులకు రుణమాఫీ కాలేదు.

- బుసి నర్సింగ్ యాదవ్, రైతు, జామిడి

#### 31 కొర్రీలతో రైతులను ముంచిండు..



నాకు జామిడి శివారులో ఐదెకరాల పొలం ఉంది. మా సొసైటీలో రూ.1.95 లక్షల బాకీ తీసుకున్నా. ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి పట్టా పాసు పుస్తకం ఉన్న రైతులందరికీ రుణమాఫీ ఇస్తానని జెప్పి ఇప్పుడు మాట మార్చాడు. గిప్పుడేమో 31 కొర్రీలు పెట్టి మా సొసైటీలో మస్తు మంది రైతులకు రుణమాఫీ కాకుండా జేసిండు. రేషన్ కార్డు లేని వాళ్లకు కూడా రుణమాఫీ జేయాలి. అప్పుడేమో ఓట్ల కోసం పట్టా పాసుబుక్ ఉన్నోళ్లందరికీ ఇస్తానని గిప్పుడు రైతులందరికీ రుణమాఫీ జేయక ముంచిండు.

- బద్దం వినోద్‌రెడ్డి, రైతు, జామిడి



షటిల్ కోర్టులో నిలిచిన వర్షపు నీరు

- శిథిలావస్థలో ఎస్సీ హాస్టల్ గదులు
- సరైన వసతులు లేక విద్యార్థుల అవస్థలు

పెచ్చులూడుతున్న వసతి గృహం స్లాబ్

తలుపులు విరిగిన మరుగుదొడ్లను వాడుతున్న విద్యార్థులు

# పెచ్చులూడుతున్నయ్..

మండలంలోని ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం కావడంతో శిథిలావస్థకు చేరిన భవనాలతో ఏ సమయంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. గదుల పైకప్పు పెచ్చులు ఊడి పడడంతో విద్యార్థులు బెంబేలెత్తిపోతున్నారు. మరుగుదొడ్లు అధ్వానంగా ఉండి, తలుపులు కూడా లేకపోవడంతో విద్యార్థులు ఆరు బయటే స్నానాలు చేస్తున్నారు. చిన్న పాటి వర్షానికే ఆట స్థలంలో వర్షపు నీరు వచ్చి చేరుతున్నది. వర్షపు నీరు నిల్వ ఉండడంతో దోమల బెడద ఎక్కువై విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని విద్యార్థులు వాపోతున్నారు. గదులకు మరమ్మతులు చేయించాలని విద్యార్థులు కోరుతున్నారు. - తాంసి, ఆగస్టు 25

## కవల పిల్లలను ఆదుకుంటాం..

- జిల్లా బాలల సంక్షేమ సమితి అధికారి రాజేంద్రప్రసాద్

ఇంద్రవెల్లి, ఆగస్టు 25 : తల్లిని కోల్పోయిన కవల పిల్లలను అన్ని విధాలుగా ఆదుకుంటామని జిల్లా బాలల సంక్షేమ సమితి అధికారి రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆదివారం అందునాయక్‌తండాకు చెందిన వాగ్మారే గోవింద్ భర్య వాగ్మారే దీక్ష ఇద్దరు కవల పిల్లలకు జన్మనిచ్చి 24 గంటల్లోనే మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని ఆదివారం తెలుసుకున్న జిల్లా బాలల సంక్షేమ సమితి అధికారులు అందునాయక్‌తండా గ్రామాన్ని సందర్శించి కవలల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. పిల్లలను బాలల సంరక్షణ అధికారులకు అప్పగించాలని, వీరిని అన్ని విధాలుగా ఆదుకుంటామని కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. దీక్ష కర్మకండ కార్యక్రమాలు పూర్తి చేసిన తరువాత అప్పగిస్తామని వాగ్మారే గోవింద్ రాత పూరకంగా రాసి ఇచ్చాడు. ఈ కార్యక్రమంలో సిబ్బంది అనిల్ పాల్గొన్నారు.

#### ఆర్థిక సాయం అందజేత

తల్లిని కోల్పోయిన కవల పిల్లలతోపాటు ఆమె కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణక్క అన్నారు. సుగుణక్క తల్లిని కోల్పోయిన కవల పిల్లలతోపాటు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సహయం అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ కన్వీనర్ జాదవ్ సునీల్, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు సోమోరె నాగోరావ్, హెచ్‌ఆర్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కాంబ్లే అతీశ్, మండల నాయకులు విశాల్, రాజు, అనిల్, అముల్ పాల్గొన్నారు.



కవల పిల్లల వివరాలు తెలుసుకుంటున్న బాలల సంరక్షణ కేంద్రం అధికారులు

## వైన్స్‌లో చోరీ

- నగదుతోపాటు, మద్యం ఎత్తుకెళ్లిన దొంగలు
- సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసుల దర్యాప్తు

నేరడిగొండ, ఆగస్టు 25 : నేరడిగొండలోని పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న వరుణ్ లిక్కర్ మార్ట్‌లో శనివారం అర్ధరాత్రి దొంగతనం జరిగినట్లు నేరడిగొండ పోలీసులు తెలిపారు. వైన్స్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న రాకేశ్ ఉదయం అటుగా వెళ్లారు. అయితే తాళాలు వేసినట్లు ఉన్న షట్టర్ రెండు ఫీట్ల వరకు లేచి ఉండడాన్ని గమనించాడు. అక్కడ ఉన్న సీసీ టీవీలు ధ్వంసం అయినట్లు గమనించి తన యజమానికి ఫోన్ చేయగా ఆయన వచ్చి పరిశీలించారు. ఈ విషయం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు సీసీ ఫుటేజీలను పరిశీలించారు. అందులో ముగ్గురు వ్యక్తులు దొంగతనానికి పాల్పడినట్లు తేలింది. ముఖానికి ముసుగు వేసుకోవడంతోపాటు హెల్మెట్ ధరించి దొంగతనం చేశారు. దీంతో పోలీసులు లోతుగా దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో రూ.8050 నగదు, రూ1,23,360 మద్యం దొంగతనం చేసినట్లు పోలీసులు తెలిపారు. సమీప ప్రాంతంలో మద్యం ఖాళీ అట్టపెట్టెలను వదిలేసి వెళ్లారు. ఇక్కడి వైన్స్‌లో గతంలో కూడా దొంగతనం జరగడం, పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా దగ్గరలో ఉండగా, వైన్స్‌లో తరచు దొంగతనాలు జరగడంపై పోలీసుల నిఘా వైఫల్యం స్పష్టంగా కనిపిస్తున్నదని స్థానికులు విమర్శిస్తున్నారు. నిర్వాహకుడు రాకేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.



మద్యం ఎత్తుకెళ్లి ఖాళీ అట్టపెట్టెలను వదిలి వెళ్లిన దొంగలు

#### కిరాణా షాపులో చోరీ

తలమడుగు, ఆగస్టు 25 : భరంపూర్ గ్రామంలోని వెంకటేశ్వర కిరాణ షాపులో శనివారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని నుగుగుంటి గంగయ్యకు చెందిన దుకాణంలో దొంగలు షట్టర్ పగలగొట్టి దుకాణంలోని గల్లపెట్టి నుంచి రూ.20 వేలు దొంగలించారు. అలాగే పక్కా దుకాణ షెట్టర్ పగులగొట్టడానికి ప్రయత్నించారు. షట్టర్ పగలకపోవడంతో పారిపోయారు. ఆదివారం ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. క్లూస్ టీం సభ్యులు సాక్ష్యాలను సేకరించారు. బాధితుడి నుంచి వివరాలు సేకరించి సమగ్ర దర్యాప్తు ప్రారంభించారు. బాధితుడు గంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఏఎస్సై కైజర్ తెలిపారు.